చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

గురుపాదం (ఫైల్)

చిన్నశంకరంపేట, డిసెంబర్ 21: చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చెన్నాయపల్లిలో శనివారం జరిగింది. చెన్నాయపల్లికి చెందిన గంగకొల గురుపాదం (30) శుక్రవారం సాయంత్రం గ్రామ శివారులోని కిష్టంకి కుంటలో చేపల వేటకు వెళ్లాడు. నీటిలో మునిగి అక్కడికక్కడే గురుపాదం మృతి చెందాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోయేసరికి కుంట వద్దకు వెళ్లి చూడగా శవమై తేలాడు. మృతుడికి భార్య రాధ ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై నారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేలిన గ్యాస్ సిలిండర్

కాలిపోయిన బీరువా, బీరువాలోని వస్తువులు

చిన్నశంకరంపేట, డిసెంబర్ 21: గ్యాస్ సిలిండర్ పేలి రూ.3.60 లక్షల నగదు దగ్ధమైన ఘటన ఎస్. కొండాపూర్ పంచాయతీ పరిధిలోని పేటగడ్డ గిరిజన తండాలో శుక్రవారం రాత్రి జరిగింది. పేటగడ్డ గిరిజన తండాకు చెందిన రాతుల రాములు నివాస పూరిగుడిసెలో గ్యాస్ సిలిండర్ పేలింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పారు. నగదుతో పాటు బంగారం వెండి, వంటపాత్రలు బీరువా, బట్టలు విలువైన కాగితాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో ఆ కుటుంబం సర్వం కోల్పోయి వీధిన పడింది. బాధితుడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా ఆర్ఐ రాజు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. బాధత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని తండావాసులు కోరుతున్నారు.

విధుల నిర్వహణపై అవగాహన

చిన్నశంకరంపేట, డిసెంబర్ 21: మోడల్ పాఠశాల ఐటీ విద్యార్థులకు మండల పరిషత్ కార్యాలయ విధుల నిర్వహణపై ఎంపీడీవో దామోదర్ శనివారం అవగాహన కల్పించారు. జడ్పీ, మండల పరిషత్ సభ్యుల విధుల గురించి అవగాహన కల్పించారు. ఆయనతో ఐటీ ఉపాధ్యాయుడు ప్రమోద్ రెడ్డి, పీడీ బస్వరాజ్ పాల్గొన్నారు.

గొర్రెల్లో పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలు

చిలిపిచెడ్, డిసెంబర్ 21: మండలంలోని జీవాల పెంపకందారులు పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరి ఇప్పించాలని మండల పశువైద్యాధికారి వినోద్‌కుమార్ సూచించారు. గొర్రెలకు ఈ వ్యాధి సోకిన వెంటనే అనారోగ్యంతో మేత మేయవన్నారు. ఈ వ్యాధి నివారణకు వెంటనే పీపీఆర్ టీకాలు వేయించాలన్నారు. వెటర్నరీ అసిస్టెంట్, సిబ్బంది ఉన్నారు.

యువకుడు అదృశ్యం

గురుపాదం (ఫైల్)

శివ్వంపేట, డిసెంబర్ 21: యువకుడు అదృశ్యమైన ఘటన శివ్వంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం దొంతి గ్రామానికి చెందిన మునిగే దినేశ్‌రెడ్డి రోజులాగే ఈ నెల 19న ఉదయం కంపెనీకి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాలేదు. దీంతో తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. బాధితుడి తండ్రి తిరుపతిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు.

ఏడుపాయల హుండీ ఆదాయం రూ.41 లక్షల96 వేలు

పాపన్నపేట్, డిసెంబర్ 21: ఏడుపాయల వనదుర్గాభవానీ దేవి ఆలయ 59 రోజుల హుండీ ఆదాయం రూ.41లక్షల 96 వేల 612 వచ్చినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, ఈవో చంద్రశేఖర్ తెలిపారు. శనివారం హుండీ లెక్కింపు ప్రకియను రాజరాజేశ్వరీ సేవా సమితి ఆధ్వర్యంలో గోకుల్ షెడ్ లో నిర్వహించారు. సూర్యశ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ శర్మ యాదగిరి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

FOR SALE

★Prime properties for sale at Siddipet Please contact : 9299008929, 6304851467, 8185855813

NT-99351

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నేషనల్ బాలరంగ్ ఫెస్టివల్‌లో గిరిజన బిడ్డలకు అపూర్వ గౌరవం

నేషనల్ బాలరంగ్ ఫెస్టివల్‌లో పాపన్నపేట విద్యార్థులు

మెదక్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): నేషనల్ బాలరంగ్ ఫెస్టివల్‌లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించిన గిరిజన బిడ్డలకు అపూర్వ గౌరవం లభించింది. వివిధ రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాల విలువలు అందరికీ విస్తరించాలన్న ఉద్దేశంతో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నేషనల్ బాల రంగ్ ఫెస్టివల్‌ను ఈ నెల 21, 22, 23 తేదీల్లో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో 21న ఈ వేడుకకు మెదక్ జిల్లా పాపన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు గిరిజన సంప్రదాయాన్ని నృత్య రూపంలో ప్రదర్శించారు. ఎలాంటి రికార్డింగ్‌ను వాడకుండా విద్యార్థులే వాయిద్యాలు వాయిస్తూ, సేవాలాల్ పాట పాడుతూ తీజ్ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రదర్శించారు. వారి వెంట రాష్ట్ర కల్చరర్ కో ఆర్డినేటర్ గిరి, కొరియోగ్రఫీ టీచర్లు అంజాగౌడ్, కృష్ణకాంత్, ఇందిర ఉన్నారు. పాపన్నపేట పాఠశాల హెచ్ఎం మహేశ్వర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నృత్య ప్రదర్శన చేసే అవకాశం రావడం పాఠశాలకు దక్కిన అపూర్వమైన గౌరవమన్నారు. విద్యార్థులను డీఈవో రాధాకిషన్, ఏఎంవో సుదర్శన మూర్తి, ఎంఈవో ప్రతాప్ రెడ్డి తదితరులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పౌష్టికాహార పండుగ

రామాయంపేట: పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలిస్తున్న తల్లిదండ్రుల కమిటీ

నిజాంపేట పాఠశాలలో ఆహారోత్సవం కార్యక్రమంలో భోజనం చేస్తున్న విద్యార్థులు

వెల్దుర్తి: హక్కీంపేటలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న టీచర్లు

- విద్యార్థులు పోషక విలువలు గల ఆహారం తీసుకోవాలి
- వంటకాలను ప్రదర్శించిన విద్యార్థులు

రామాయంపేట, డిసెంబర్ 21: మండలంలోని రాయిలాపూర్, సుతారిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ ప్రోగ్రాంను హెచ్ఎం నాగరాజు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. తెలంగాణ ఆహార దినోత్సవంలో భాగంగా అనేక రకాల వంటకాలు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు ప్రవీణ్, సుధాకర్, శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తి, డిసెంబర్ 21: మాసాయిపేట మండలంలోని హక్కీంపేట పాఠశాలలో ఉపాధ్యాయుడు కిషన్, కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, మహిళలు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ స్పప్న, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నిజాంపేటలో..

నిజాంపేట, డిసెంబర్ 21: నిజాంపేట పాఠశాలలో హెచ్ఎం అరుణ ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రాముఖ్యతపై విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

చిలిపిచెడ్‌లో..

చిలిపిచెడ్, డిసెంబర్ 21: విద్యార్థులు పోషక విలువలు గల ఆకుకూరలను ఆహారంగా తీసుకోవాలని ఎంపీవో విఠల్ సూచించారు. బద్రియ తండా, చిట్కుల్ పాఠశాలల్లో తనిఖీ చేశారు. చండూర్ కాంప్లక్స్ హెచ్ఎం హరిసింగ్ పాల్గొన్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, డిసెంబర్ 21: మండలంలోని చందంపేట ప్రాథమిక పాఠశాలలో వివిధ రకాల వంటకాలను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో చైర్మన్ గౌతమ్, సభ్యులు చంద్రకళ, లక్ష్మీభూపాల్, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు శివప్రసాద్ సంతోష్, శ్రీధర్ పాల్గొన్నారు.

చిలిపిచెడ్: బద్రియ తండాలో విద్యార్థులకు పోషకాహారం గురించి వివరిస్తున్న ఎంఈవో విఠల్

కౌడిపల్లిలో..

కౌడిపల్లి, డిసెంబర్ 21: మండలంలోని కన్నారం తండా, కొర్రసీత్య తండాల పాఠశాలను ఎంఈవో బాల్‌రాజు తనిఖీ చేశారు. విద్యార్థులతో రాయడం, చదవడం పరిశీలించారు. కన్నారం తండా పాఠశాల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

వెల్దుర్తి: గణిత నమూనాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నిజాంపేట, డిసెంబర్ 21: గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతి సందర్భంగా నిజాంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణిత శాస్త్రానికి సంబంధించి ప్రదర్శించిన స్టాళ్లను ఎంఈవో యాదగిరి, హెచ్ఎం జ్ఞాలమాల, ఆర్ఐ ప్రీతి పరిశీలించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, అలీ, దేవయ్య, శ్రీనివాస్‌చారి, వెంకటస్వామి, రమేశ్, వందన ఉన్నారు.

నిజాంపేట పాఠశాలలో

నర్సాపూర్ మోడల్ స్కూల్‌లో..

నర్సాపూర్, డిసెంబర్ 21: నర్సాపూర్ మండలంలోని జక్కపల్లి తెలంగాణ మోడల్ స్కూల్‌లో శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీవాణి, ఉపాధ్యాయులు వెంకటరత్నం, సుయోధన రావు, శివకుమార్ పాల్గొన్నారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తి, డిసెంబర్ 21: మండలంలోని కుకునూర్ జడ్పీహెచ్ఎస్‌లో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన గణిత నమూనాలను ఎంఈవో యాదగిరి, హెచ్ఎం సీతారాం, ఉపాధ్యాయులతో కలిసి సందర్శించారు.



నర్సాపూర్: శ్రీనివాస రామనుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఉప రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అధికారులు

- సీఎస్ శాంతికుమారి

మెదక్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ): ఉప రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలని సీఎస్ శాంతికుమారి అన్నారు. ఈనెల 25న మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికిలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సందర్శించనున్నారని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డితో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఉప రాష్ట్రపతి పర్యటన మధ్యాహ్నం 2:15 నుంచి 4:15 వరకు జిల్లాలో ఉంటుందని, పోలీసు, వైద్య, ఆర్‌అండ్‌బీ, ఇతర శాఖల సమన్వయంతో పని చేస్తామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ చేసి పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో ఉపరాష్ట్రపతి ఆర్గానిక్ వ్యవసాయంపై ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించడంతోపాటు ఆర్గానిక్ వ్యవసాయం చేస్తున్న రైతులతో మాట్లాడుతారని, అత్యవసర వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నామని కలెక్టర్ సీఎస్ వివరించారు. ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపరాష్ట్రపతి పర్యటనకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహమ్మద్ నగర్‌లో ఘనంగా బాలమేళా

కౌడిపల్లి, డిసెంబర్ 21: మండలంలోని మహమ్మద్ నగర్ రైతు వేదికలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలమేళా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పలువురు చిన్నారులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. నర్సాపూర్ పాజెక్ట్ సీడీపీవో హేమాభార్గవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజువారీగా ఆటపాటల ద్వారా విద్యాబోధన, చిన్నారులకు అర్థమయ్యేలా నేర్పించడానికి ఉపయోగించే స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిల్లలతో ఆడుతూ పాడుతూ నేర్పించిన అంశాలను తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం చిన్నారుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్లు లక్ష్మి, ఖమర్ సుల్తానా, అయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

కమ్ముకున్న మంచు దుప్పటి

చిన్నశంకరంపేట గ్రామాన్ని కప్పేసిన పాగమంచు

రామాయంపేటలో..

నిజాంపేట: పొలాలపై భారీగా కురుస్తున్న పాగమంచు

రామాయంపేటలో..

చిన్నశంకరంపేటలో లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనదారుడు

నిజాంపేట, రామాయంపేట, చిన్నశంకరంపేట మండలాల వ్యాప్తంగా శనివారం విపరీతమైన పాగమంచు కురిసింది. పొగమంచు కారణంగా వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని ప్రయాణం కొనసాగించారు. చలి ప్రభావం రోజురోజుకూ పెరుగుతున్నది. ఉదయం 9 గంటల వరకు భానుడి జాడ కనబడడంలేదు. - నిజాంపేట/రామాయంపేట/చిన్నశకరంపేట, డిసెంబర్21

కక్ష సాధింపు చర్యల్లో భాగమే కేటీఆర్‌పై కేసు

మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి

మెదక్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు కేసులు నమోదు చేస్తున్నదని మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల శశిధర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ వాదులు, మేధావులందరూ ముక్తకంఠంతో దీన్ని ఖండిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మెదక్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలులో ఘోరంగా విఫలమయ్యారన్నారు. తుగ్లక్ పాలనను తలపించేలా కాంగ్రెస్ పాలిస్తున్నదని, ఇది శోచనీయమన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మాసాయిపేట విద్యార్థిని

విద్యార్థినికి స్పైక్స్ షూస్‌ను అందజేస్తున్న హెచ్ఎం

వెల్దుర్తి, డిసెంబర్ 21: వరంగల్‌లో ఈ నెల 31 నుంచి జనవరి 2వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మాసాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన శ్రీనిధి ఎంపికైనట్లు హెచ్ఎం ధర్మపురి తెలిపారు. జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సబ్ జూనియర్ విభాగంలో ట్రయథ్లాన్ పోటీల్లో శ్రీనిధి మొదటి స్థానంలో నిలిచి, బంగారు పతకం సాధించింది. దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్ఎం తెలిపారు. శనివారం హెచ్ఎం, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు శ్రీనిధిని అభినందించారు. ఆమెకు స్పైక్స్ షూస్‌ను పాఠశాల తరపున హెచ్ఎం అందజేశారు. అనంతరం విద్యార్థిని సన్మానించారు. కార్యక్రమంలో పీఈటీ శ్యాంసుదర్‌శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామాయంపేటలో ఆర్‌పీఎల్ క్రికెట్ పోటీలు

రామాయంపేట, డిసెంబర్ 21: రామాయంపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను జనవరి మొదటి వారంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బసన్నపల్లి మల్లేశం, రాగి ఉమామహేశ్వర్, బాలు పేర్కొన్నారు. శనివారం రామాయంపేటలోని ఓ ఫంక్షన్ హాల్లో క్రికెట్ క్రీడాకారుల ఎంపికలో భాగంగా మాట్లాడారు. ఈ క్రీడలను రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తామని తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు ప్రజలు సహకరించాలి

రామాయంపేట: అక్కన్నపేటలో సర్వే వివరాలు సేకరిస్తున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

జడ్పీ సీఈవో ఎల్లయ్య

రామాయంపేట, డిసెంబర్ 21: ఇందిరమ్మ ఇండ్ల సర్వేను గ్రామాల కార్యదర్శులు సమగ్రవంతంగా చేపట్టాలని, ఇందుకు ప్రజలకు సహకరించాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని అక్కన్నపేటలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. సర్వేలో ప్రభుత్వం సూచించిన నిబంధనలను పక్కాగా సేకరించాలన్నారు. సర్వలో లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో షాజులుద్దీన్, గ్రామ కార్యదర్శి సరిత తదితరులు ఉన్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట,డిసెంబర్21: మండలంలోని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతుంది. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వద్దకు అధికారులు వెళ్లి సర్వే చేస్తున్నారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్, డిసెంబర్ 21: మున్సిపాలిటీలోని 5వ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను త్వరగా పూర్తి చేయాలని కౌన్సిలర్ సురేశ్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కమిషనర్ రామకృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుంది

రామాయంపేట, డిసెంబర్ 21: ఆత్మరక్షణకు, ఆరోగ్యానికి కరాటే దోహదపడుతుందని సీఐ వెంకటరాజగౌడ్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కశాశాల మైదానంలో కరాటే శిక్షణను పరిశీలించి, మాస్టర్ రామకృష్ణకు అభినందనలు తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

విద్యార్థులను సన్మానిస్తున్న తహసీల్దార్ మన్నన్

చిన్నశంకరంపేట, డిసెంబర్ 21: చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తహసీల్దార్ మన్నన్ సూచించారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన తెలంగాణ మోడల్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులను సన్మానించారు. 100మీటర్ల పరుగు పందెంలో జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచిన శ్రీవల్లి, బ్యాడ్మింటన్‌లో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన శ్రీవల్లి, కుమారి, జువాలిన్ త్రోలో మొదటి బహుమతిని గెలుచుకున్న వైశాలిని పీడీ బస్వరాజ్, ప్రిన్సిపాల్ వాణికుమార్ సన్మానించారు.

డాన్ బాస్కో పాఠశాలలో స్పోర్ట్స్ మీట్

నర్సాపూర్, డిసెంబర్ 21: నర్సాపూర్‌లోని సెయింట్ డాన్ బాస్కో పాఠశాలలో శనివారం స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో తారాసింగ్ మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నర్సిరెడ్డి, కరస్పాండెంట్ యశ్వంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మేఘన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సాపూర్ డాన్‌బాస్కో పాఠశాలలో స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న ఎంఈవో తారాసింగ్